క్లుప్తంగా

12న కేశంపేటకు కవిత రాక



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: మండల కేంద్రానికి ఈ నెల 12వ తేదీన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రమేశ్ తెలిపారు. బీసీల హక్కులు సాధనతో పాటుగా 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ జాగృతి, యూనైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, బీసీ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం వివిధ సంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎదిరే వెంకటయ్య, అశోక్, చీమల శ్రీనివాస్, కృష్ణయ్య, రంగయ్య, తిరుపతయ్య, గోపాల్ యాదవ్, వెంకటయ్య, శ్రీనివాస్, శేఖర్, రాఘవేందర్, లింగస్వామి, సుధాకర్, మహేశ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చాతుర్మాస్య యజ్ఞం ప్రారంభం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల కేంద్రంలోని శ్రీశివ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో చాతుర్మాస్య యజ్ఞం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. యజ్ఞం ప్రతీ సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ద్వాదశి (4 నెలలు) వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, భక్తుల సాయంతో నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటుగా సమీప గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు యాదయ్య, విజయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనసూయ, బాల్‌రెడ్డి, రాఘవేందర్, నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి



మొక్కలు నాటి నీరు పోస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారంలో ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా గ్రామంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శివశంకర్, వినోద్‌కుమార్, కృష్ణయ్య, ప్రశాంత్, విష్ణు, శ్రీనివాస్, మహేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు అసెంబ్లీకే రావాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్‌రూరల్: కేటీఆర్ ధైర్యం ఉంటే అసెంబ్లీని వేదిక చేసుకోవాలని లేదంటే మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను కాంగ్రెస్ పార్టీ ఎండగడుతుందని గుర్తుచేశారు. ఏదీఏమైనా కాంగ్రెస్ పార్టీ 16 నెలల్లోనే రాష్ట్రంలోని ప్రజలకు ఆర్థికంగా చేయూతనిస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతో కృషి చేస్తోందన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో జరిగిన ఖర్గే మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ధైర్యం ఉంటే రాష్ట్ర అసెంబ్లీ వేదికగా తీసుకొని ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉండి చర్చించాల్సిన బాధ్యత ఆయనదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు.

వనమహోత్సవానికి సన్నద్ధం!

- నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు సిద్ధం
- పకడ్బందీగా చేపట్టేందుకు అధికారుల ప్రణాళికలు
- మండలంలో 4.10లక్షలు నాటడమే లక్ష్యం
- ఇప్పటికే నాటే ప్రాంతాల గుర్తింపు



షాబాద్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: రాష్ట్రంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో విడతలో వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సారి 11 విడతలో ఉత్సాహంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జూలైలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

11 విడతలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు.. 11వ విడతలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వానలు కురవడమే ఆలస్యం.. మొక్కలు నాటేందుకు డీఆర్‌డీఏ, అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలలు, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ప్రజలకు, రైతులు అడిగిన మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

41 జీపీల్లో మొక్కల పెంపకం

మండంలోని 41 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామాల్లో నర్సరీని ఏర్పాటు చేసి ఉపాధీ హామీ పథకంలో భాగంగా మొక్కలు పెంచుతున్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలో 4లక్షల 10 వేల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఈ మేరకు నర్సరీలలో పండ్లు, పూలు, ఉసిరి, నిమ్మ, మునగ, కరివేపాకు, కానుగ, చింత, వేప, చీమచింత, కాగితపు రకాలు నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నాయి. మరీ ఈ సారైనా ప్రభుత్వం వనమహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టి నాటిన ప్రతీ మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి



వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రజాప్రతినిధులతో పాటూ ప్రజల సహకారం పూర్తిస్థాయిలో అవసరం. అందరూ భాగ్యస్వాములు అయితేనే లక్ష్యాన్ని చేరగలుగుతాం.

– అపర్ణ, ఎంపీడీఓ

ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం



మండంలోని అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. 41 గ్రామ పంచాయతీలలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటాల్సి ఉంది. ప్రతీ గ్రామంలో వెయ్యి నుంచి 5 వేల మొక్కలను నాటనున్నాం. వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. అధికారుల ఆదేశాలు రాగానే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

– వీరాసింగ్, ఏపీఓ

కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు సరికాదు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

షాద్‌నగర్‌రూరల్: ఫోన్ ట్యాపింగ్‌కు టాంపరింగ్‌కు తేడా తెలియని వాళ్లు ఫోన్ ట్యాపింగ్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఎద్దేవా చేశారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పక్షాన ఉన్న కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని మరిచి ప్రతిపక్ష నాయకులను ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఓ యువనేత ఉన్నారని అన్ని ఆధారాలు ఉన్నట్లు స్వయంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రస్తావించారని, ఆధారాలు ఉంటే 48 గంటల్లో రుజువు చేయాలని పత్రికాముఖంగా కోరుతున్నామన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులను అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పాలకులు ఏనాడూ అధికారుల అవతార మెత్తి వసూళ్లకు పాల్పడలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నాం కదా అని కేసులు పెడతాం, బెదిరింపులకు పాల్పడతాం, మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థ ఒప్పుకోదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రహించాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పనికిరాని రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకొని మీ దగ్గర ఉన్న ఆ యువనేత ఆధారాలను పూర్తి వివరాలతో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఎలాంటి న్యాయ పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, గుండు అశోక్, శీలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వాల్ లీకేజీ.. భారీగా నీటి వృథా



గేట్‌వాల్ నుంచి లీకవుతున్న భగీరథ నీరు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య జూనియర్ కళాశాల సమీపంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన గేట్‌వాల్ గత నెల రోజులుగా లీకేజీ అవుతోంది. దీంతో భారీ ఎత్తున నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. సమస్యను స్థానికులు సాక్షి ప్రతినిధి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యను మున్సిపల్ కమిషనర్ యోగేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మిషన్ భగీరథ అధికారులను అప్రమత్తం చేసి, గేట్ వాల్ లీకేజీకి ఆదివారం మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కమిషనర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోండి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఓ యువనేత ఉన్నారని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై యువనేత పేరు చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరికలు చేసినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ కూడా పార్టీ పేరు, యువనేత పేరు ప్రస్తావన చేయలేదని, కానీ గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు అల్టిమేటం ఇవ్వడం వెనుక ఏ నాయకుడి కుట్ర దాగుందో విరించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత విషయాలపై ఫోన్ ట్యాపింగ్ చేసి నీచ సంస్కృతికి పాల్పడిన వారిపై పోరాటం చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుపడటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ఫోన్‌లు ట్యాపింగ్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణకు రావాలని చెబుతున్నారని, మరి ట్యాంపింగ్‌లో వారి ప్రమేయం లేకుంటే ఎందుకు మాట్లాడాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై జరుగుతున్న రాద్ధాంతంపై ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు జరపాలని సిట్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదన్నారు. మాకు ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, బీఆర్‌ఎస్ నాయకులు బెదిరింపులకు దిగుతున్న నేపథ్యంలో న్యాయపరమైన విచారణ జరపాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, ఆదివాసీ విభాగం రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ఎండీ ఇబ్రహీం ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్: పట్టణంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్(ఎస్‌వీపీ) డిగ్రీ కళాశాలలో 2006–09లో డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 సంవత్సరాల వారందరూ ఒకచోట కలిసి ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించి మెమొంటోలను అందజేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కట్ట నుంచి ఆలయం వరకు రోడ్డును వేయాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో రోడ్డు గురించి వాకబు చేశారు. శ్రావణమాసంలో జరిగే స్వామి వారి కల్యాణోత్సవంలోపు రోడ్డును వేయాని కమిషనర్ సత్యనారాయణను ఆదేశించారు. కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి శివకుమార్, సభ్యులు ఆనందప్ప, విశ్వనాథ్, పవన్, రమేష్, శివకుమార్, ప్రభు, మహేశ్, బాలరాజ్, నాగేష్, కిషోర్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గ్రామాల్లో రేబీస్ వ్యాక్సినేషన్ శిబిరాలు ప్రారంభం



షాద్‌నగర్‌రూరల్: యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఇండ్లల్లో, ఫామ్‌హౌస్‌లలో ఉన్న పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ప్రపంచ జూనోసెస్ డేను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పశువైద్యశాఖ, యానిమల్స్ కేర్ సొసైటీ సంస్థ సహకారంతో యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రేబీస్ అనేది ఒక తీవ్రమైన వైరల్ వ్యాధి అని.. ఇది పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందుతుందన్నారు. కుక్కకాటుతో ఈ వ్యాధి వస్తుందన్నారు. రేబీతో దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 20వేల మరణాలు జరుగుతున్నాయన్నారు. రేబీస్‌కు నివారణ చర్యగా పెంపుడు కుక్కలు, పిల్లులు, ఇతర పెంపుడు జంతువులకు ముందస్తుగా వ్యాక్సినేషన్ తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా వెటర్నరీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యులు ముక్కంటి రాజ్, సునీత, వంశీకృష్ణరెడ్డి, వెంకటేశ్, సహాయ పశువైద్య సిబ్బంది లావణ్య, శ్రీధర్, చంద్రశేఖర్, నజీర్, జగదీశ్వర్, దినేశ్, సలీం, యానిమల్స్ కేర్ సొసైటీ ప్రతినిధులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల: మూగజీవాల్లో వచ్చే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా మూగజీవాలకు ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ ఖలీల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రమాదకరమైన వ్యాధి రేబీస్

మొయినాబాద్: జంతువులు నుంచి మానవులకు సంక్రమించే అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో రేబీస్ ఒకటని పశుసంవర్ధకశాఖ చేవెళ్ల డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా ఆదివారం మున్సిపాలిటీలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అహ్మద్, సిబ్బంది గోరెమియా పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

మొయినాబాద్‌రూరల్: పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్య అధికారి దేవిరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలో రేబీస్ టీకాల కార్యక్రమాన్ని పశువైద్య అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి, పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో శునకాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



షాబాద్: నాగర్‌గూడలో నివాళులర్పిస్తున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

షాబాద్: అణగారిన వర్గాల అభివృద్ధికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన రాజకీయ–సామాజిక యోధుడని కొనియాడారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, తెలంగాణ జన సమితి అసెంబ్లీ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే), ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య, తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొళ్ల ఆంజనేయులు, నాయకులు తదితరులు ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు

మొయినాబాద్‌రూరల్: స్వాతంత్య్ర పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా ఓబీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్ చౌరస్తాలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్‌ముదిరాజ్, శాంతియువజన సంఘం మాజీ అధ్యక్షుడు జెల్లల మల్లేష్, గిరిబాబు, శ్రీనివాస్‌గౌడ్, కిషన్, రవి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తొలిఏకాదశి సందడి



చేవెళ్ల: శ్రీబాలాజీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



షాబాద్: నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తొలిఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో దర్శనం కోసం క్యూ కట్టారు. సెలవు దినం కలిసి రావటంతో భక్తులతో సందడి కనిపించింది. ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మొహర్రం వేడుకలను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పది రోజులుగా వేడుకలు ఘనంగా కొనసాగాయి. చివరిరోజు వీధుల్లో డప్పువాయిద్యాల మధ్య పీర్లను ఊరేగించారు. పలువురు దట్టీలు, మలీదా సమర్పించారు. వారందరికీ ముస్లింలు షర్బత్ పంపిణీ చేశారు. పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అలయ్‌దులా ఆడారు. అనంతరం పీర్లను నిమజ్జనం చేశారు.



కొత్తూరు: షర్బత్ పంపిణీ చేస్తున్న మైనార్టీ నాయకులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు



షాబాద్‌లో..



మొయినాబాద్: సురంగల్‌లో పీర్ల ఊరేగింపు



కొందుర్గు: మండల కేంద్రంలో పీర్ల ఊరేగింపు